జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో
కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

గురువారం | 4-12-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 527 పేజీలు: 4 వెల : రూ.7



# మర్డర్



* రెండు రోజుల వ్యవధిలో ఇద్దరు మహిళల దారుణ హత్య
* బంగారం కోసమే మర్డర్ చేసి ఉంటారన్న కుటుంబీకులు
* కేసు నమోదు చేసిన ఎచ్చెర్ల, లావేరు పోలీసులు
* ఆందోళనలో జిల్లావాసులు

**శ్రీకాకుళం క్రైం, డిసెంబరు 3 (వార్త):** రెండు రోజుల వ్యవధిలో ఇద్దరు మహిళలు హత్యకు గురయ్యారు. పశువులను మేతకు తీసుకువెళ్లిన ఓ వృద్ధురాలు బావిలో శవమై కనిపించగా, ఆసుపత్రికి వెళ్తానని చెప్పిన ఓ వివాహిత రోడ్డు పక్కన విగతజీవిగా కనిపించింది. దీంతో పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బంగారం కోసమే అగంతకులు హత్య చేసి వుంటారని కుటుంబీకులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. ఎచ్చెర్ల మండలం కేశవరావుపేట సమీపంలో జాతీయ రహదారిపై ఓ మహిళ హత్యకు గురైంది. పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. పొందూరు మండలం పిల్లలవలస గ్రామానికి చెందిన గురుగుబెల్లి తులసీరత్నం(43)కు ఆమదాలవలస మండలం కొత్తవలసకు చెందిన కూర్మారావుతో వివాహమైంది. వీరు శ్రీకాకుళం ఏఎస్ఎన్ కాలనీలో నివాసముంటున్నారు. చర్మవ్యాధితో బాధపడుతున్న తులసీరత్నం ఆసుపత్రికి వెళ్తానని చెప్పి మంగళవారం సాయంత్రం బయటకు వెళ్లింది. రాత్రయినప్పటికీ ఆమె ఇంటికి రాకపోవడం, ఫోన్ స్విచ్ ఆఫ్ రావడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. బంధువులను, తెలిసి వారి ఇళ్లతో పాటు నగరంలో వెదికారు. చివరకు శ్రీకాకుళం రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బుధవారం ఉదయం ఆమె మృతదేహం కేశవరావుపేట సమీపంలో జాతీయ రహదారిపై ఉండటాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఎచ్చెర్ల పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతురాలు తులసీరత్నంగా గుర్తించి ఆమె కుటుంబీకులకు సమాచారం అందించారు. మృతురాలి మెడపై తాడుతో బిగించి హత్య చేసివుంటారని పోలీసులు ప్రాథమిక అంచనాకు వచ్చారు. ఎచ్చెర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## బావిలో వృద్ధురాలి మృతదేహం

పశువులను మేపేందుకు వెళ్లిన లావేరు మండలం మురపాకకు చెందిన పార్వతమ్మ (65) మృతదేహం శిథిలబావిలో బుధవారం కనిపించింది. బంగారం కోసమే ఆమెను హత్య చేసి వుంటారని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పార్వతమ్మ సోమవారం పశువులను మేపేందుకు వెళ్లింది. రాత్రయినా ఆమె ఇంటికి చేరలేదు. దీంతో కుటుంబీకులు పరిసర ప్రాంతాలు గాలించి చివరకు లావేరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్లూస్‌టీం, డాగ్‌స్క్వాడ్ బృందాలు పరిసర ప్రాంతాల్లో రాత్రి వరకు వెతికినప్పటికీ ఫలితం లేకపోయింది. బుధవారం కల్లానికి సమీపంలో ఉన్న రెండు నేలబావుల్లో వెతకగా ఓ శిథిల బావిలో మృతదేహం కనిపించింది. పార్వతమ్మ ముక్కు, చెవుల వద్ద తీవ్ర గాయాలు, తల వెంట్రుకలు, చీర కాలిపోయి ఉండటంతో దుండగులు ఆమెను బంగారం కోసం హత్యచేసి అనంతరం నిప్పంటించి మృతదేహాన్ని బావిలో పడేసి వుంటారని పోలీసులు ప్రాథమిక అంచనాకు వచ్చారు. లావేరు ఎస్సై కె.అప్పలసూరి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# విభిన్న ప్రతిభావంతులకు మరింత ప్రోత్సాహం

* వారిలో ఆత్మస్థైర్యాన్ని, ధైర్యాన్ని నింపాలి
* దివ్యాంగుల సమస్యలు పరిష్కారానికే స్వాభిమాన్
* జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్
* విజేతలకు బహుమతుల ప్రదానం
* ఘనంగా అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం



**శ్రీకాకుళం డిసెంబర్3(వార్త):** విభిన్న ప్రతిభావంతులను మరింత ప్రోత్సాహం అందించి అండగా ఉంటామని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. వారిలో ఆత్మస్థైర్యాన్ని, ధైర్యాన్ని కలిగించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని తెలిపారు. బుధవారం శ్రీకాకుళం జిల్లా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా నరసన్నపేట శాసనసభ్యులు బగ్గు రమణమూర్తి కలెక్టర్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడారు. దివ్యాంగులకు రిజర్వేషన్లు కల్పించడంతో పాటు వారి సంక్షేమానికి, అభివృద్ధికి అవసరమైన పథకాలను ప్రభుత్వం అందిస్తోందన్నారు. స్వాభిమాన్ కార్యక్రమం ద్వారా ప్రత్యేక గ్రీవెన్స్‌లో దివ్యాంగుల సమస్యలు పరిష్కరిస్తున్నామని చెప్పారు. దివ్యాంగులకు వైద్య సదుపాయాలు కల్పించడంతోపాటు వీరికి ప్రభుత్వం ఉద్యోగములలో 4 శాతం రిజర్వేషన్‌లు, ఉన్నత విద్య కోర్సులలో 5 ఐదు శాతం సీట్లు కేటాయిస్తున్నట్లు తెలిపారు. దృష్టిలోపం కలిగిన వికలాంగులకు ప్రభుత్వ ఆసుపత్రి రిమ్స్‌లో ఏ.ఐ స్పెట్స్ అందుబాటులో ఉనట్లు తెలిపారు. నరసన్నపేట శాసనసభ్యులు బగ్గు వెంకటరమణమూర్తి మాట్లాడుతూ దివ్యాంగుల పట్ల మానవతా దృక్పథంతో వారికి అందరం సేవచేయాలన్నారు. వికలాంగులకు అందిస్తున్న వికలాంగు పింఛన్ను ఈ ప్రభుత్వం ఆరు వేలు ఇస్తుందని గుర్తుచేశారు. శ్రీకాకుళం శాసనసభ్యులు గొండు శంకర్ మాట్లాడుతూ దివ్యాంగులకు ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించడంలో ప్రభుత్వం ముందంజలో ఉందన్నారు. కార్యక్రమంలో భాగంగా డిగ్రీ చదువుతున్న విద్యార్థులకు లాప్టాప్‌లు అందించారు. దివ్యాంగుల క్రీడల పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో విపన్న ప్రతిభవంతుల శాఖ ఇన్చార్జి ఏడి బి.శైలజ, సంబంధిత శాఖ సిబ్బంది, దివ్యాంగులు, విద్యా వాలంటీర్స్ పాల్గొన్నారు.



## వైసీపీ ఇన్‌చార్జ్‌పై టీడీపీ నేతల ఫిర్యాదు

**శ్రీకాకుళం, డిసెంబర్ 3 (వార్త):** ఆమదాలవలస ఎమ్మెల్యే, పీయూసీ చైర్మన్ కూన రవికుమార్‌పై వైసీపీ ఇన్‌చార్జ్ చింతాడ రవికుమార్ చేసిన నిరాధార వ్యక్తిగత దూషణలు, తప్పుడు ప్రచారాలు చేసినందుకు గాను తెలుగు దేశం పార్టీ నాయకులు బుధవారం ఆమదాలవలస పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం టీడీపీ నాయకులు మాట్లాడుతూ ఎమ్మెల్యేపై అసత్య ఆరో పణలు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమన్నారు. సంబంధిత ఆధా రాలతో పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.

### రోడ్డు ప్రమాదంలో
## ఇద్దరికి గాయాలు

**శ్రీకాకుళం క్రైం, డిసెంబర్3(వార్త):** ఎచ్చెర్ల పోలీస్ క్వార్టర్స్ వద్ద బుధవారం రాత్రి జరిగిన ప్రమాదంలో ఇద్దరు యువకులు గాయపడ్డారు. లావేరు మండలం పెదలింగాల వలసకి చెందిన చందన గణేష్, కొత్తూరు మండలం కడుమ గ్రామానికి పాలిశెట్టి చందు మోటార్ బైక్‌పై ఎచ్చెర్ల నుంచి శ్రీకాకుళం వస్తుండగా పోలీస్ క్వార్టర్స్ వద్ద డివైడర్‌ను ఢీకొట్టారు. దీంతో చందు కాలు విరిగిపోగా, గణేష్ తలకు తీవ్ర గాయమైంది. వారిని చికిత్స నిమిత్తం శ్రీకాకుళంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఎచ్చెర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## లగేజీ ఆటో బోల్తా

పాతపట్నం మండలం సొద గ్రామ కూడలి చేరువలో బుధవారం ఓ లగేజీ ఆటో బోల్తాపడింది. ఈ ఘటనలో సంతోషపురం గ్రామానికి చెందిన బేరింగి యశ్వంత్ గాయపడ్డాడు. యశ్వంత్ కొమనాపల్లి కాలనీకు లగేజీ ఆటోలో సామగ్రితో వెళ్లి తిరిగివస్తుండగా సొద గ్రామ సమీపంలోని కూడలి వద్ద ఆటో బోల్తా పడింది.

## ధాన్యం బస్తాలకు నిప్పు

**హిరమండలం, ఎల్ఎన్‌పేట, డిసెంబర్ 3 (వార్త):** గులుమూరు గ్రామానికి చెందిన పి.పద్మావతి, జి.లచ్చన్నలకు చెందిన ధాన్యం బస్తాలకు అగంతకులు నిప్పు పెట్టడంతో అవి కాలి బూడిదయ్యాయి. సర్పంచ్ సుంకరి కోటీశ్వరరావు హిరమండలం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పద్మావతికి చెందిన 55 ధాన్యం బస్తాలు, లచ్చన్నకు చెందిన 36 బస్తాలు ధాన్యం కొనుగోలు కేంద్రానికి తరలించేందుకు సిద్ధం చేశారు. ఈ తరుణంలో కళ్లంలో నిల్వ చేసిన ధాన్యం బస్తాలను గుర్తు తెలియన వ్యక్తులు నిప్పు అంటించారని బాధితులు ఆరోపిస్తున్నారు. ఈ ధాన్యం బస్తాలను మండల రెవెన్యూ పరిశీలకులు ఎం.కాళీప్రసాద్, వీఆర్వో పకీరు నాయుడులతో పాటు హెడ్ కానిస్టేబుల్ బిహెచ్.రమణ పరిశీలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



# వెంకటగిరిని సన్మానించిన విభూది

**శ్రీకాకుళం, డిసెంబరు 3(వార్త):** శ్రీకాకుళంలోని 31 డివిజన్ పరిధిలోని దండి వీధి నివాసి శంబుమహంతి వెంకటగిరిని ఆ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి, ఏపీ కనీస వేతనాల కమిటీ సభ్యుడు విభూది సూరిబాబు, స్థానిక నాయకులతో కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమి ధరలు విపరీతంగా పెరిగిన ఈ రోజుల్లో సీసీ రోడ్డు నిర్మాణం కోసం ఆయన స్థలాన్ని ఉచితంగా ఇవ్వడం చాలా అభినందనీయమని, ఎంతో మందికి ఆయన ప్రేరణగా నిలుస్తారని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు, పాల్గొన్నారు.



## న్యాయవాదులకు రూ.10వేల పింఛన్‌కు కృషి




**శ్రీకాకుళం, డిసెంబరు 3(వార్త):** ఏపీ రాష్ట్ర బార్ కౌన్సిల్ ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్లు ప్రముఖ న్యాయవాది కిల్లి మార్కండేశ్వరరావు తెలిపారు, 60 ఏళ్ల వయస్సు, 20 ఏళ్ల ప్రాక్టీసు ఆంధ్రప్రదేశ్‌లో గల న్యాయవాదులకు నెలకు రూ.10,000 పింఛన్, ఆలిండియా బార్ ఎగ్జామినేషన్, జ్యుడీషియల్ పరీక్షకు ప్రిపేర్ అయ్యే న్యాయవాదులకు ఉచిత కోచింగ్‌నకు కృషి చేస్తానన్నారు. న్యాయవాదులు మరణిస్తే ఇచ్చే పరిహారాన్ని రూ. 15 లక్షలకు పెంచడానికి కృషి చేస్తానని తెలిపారు. యువ న్యాయవాదుల క్రీడా పోటీలకు క్రీడా మెటీరి యల్ అందిస్తానన్నారు. ముఖ్యంగా మహిళా న్యాయవాదులకు ప్రత్యేక గదులను కేటాయిస్తామని తెలిపారు. న్యాయవాదులకు ఉచిత మెడికల్ క్యాంపులు నిర్వహిస్తానని తెలిపారు. కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లా బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ తంగి శివప్రసాద్, కార్యదర్శి పిట్ట దామోదర్, సీనియర్ న్యాయ వాదులు ఆగూరు ఉమామహేశ్వరరావు, భవానీప్రసాద్, సూర వేణుగోపాల రావు, కొమ్ము రమణమూర్తి, త్రిపురాన వరప్రసాద్, బి.ఎస్ చలం, కొమరావు ఆఫీసునాయుడు, పి.నాగేశ్వరరావు, కూన వాసు, మామిడి క్రాంతి, జిల్లా బార్ పూర్వ అధ్యక్షులు వాన కృష్ణచంద్, ఎన్ని సూర్యారావు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

## కొండయ్య మృతికి సంతాపం



**ఆమదాలవలస, డిసెంబరు 3(వార్త):** సిఐటియు జిల్లా వ్యవస్థాపకులలో ఒకరైన కామ్రేడ్ మెట్ట కొండయ్య మృతికి పలువురు ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. కొండయ్య భౌతికయానికి సిఐటియు జెండా కప్పి నివాళులర్పించారు. అనేక నిర్బంధాలు ఎదుర్కొని 1970లో ఆమదాలవలస షుగర్ ఫ్యాక్టరీలో సిఐటియు ఏర్పాటు చేసి కార్మికవర్గాన్ని ఐక్యం చేశారని కొనియాడారు. 1971లో పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచా లని, బోనస్ చెల్లించాలని 56 రోజుల పాటు నిర్బంధాన్ని సైతం ఎదుర్కొని సమ్మె విజయవంతం చేయడంలో కొండయ్య కీలకపాత్ర పోషించారని కొనియాడారు. కొండయ్య కార్మికుల పక్షాన, రైతాంగం పక్షాన, బడుగు బలహీన వర్గాల పక్షాన నిరంతరం పోరాడిన వ్యక్తని వారన్నారు. కార్యక్రమంలో సిపిఎంజిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, సిఐటియు సీనియర్ నాయకులు కే.శ్రీనివాస్, బి.కృష్ణమూర్తి, శ్రామిక మహిళ కన్వీనర్ కే నాగమణి, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.మోహనరావు, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వి.రమణ, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ కార్యకర్త కుటుంబానికి ఎన్ఈఆర్ పరామర్శ



**జి.సిగడాం, డిసెంబరు 3 (వార్త):** ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి కోలు కుంటున్న జి.సిగడాం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త మజ్జి కన్నం నాయుడు కుమార్తె మజ్జి చరిష్మాను బుధవారం ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఈఆర్) పరామర్శించారు. ఆరోగ్యపరిస్థితి అడిగి తెలుసుకొని చరిష్మాకు మనోధైర్యాన్ని తెలిపి కుటుంబానికి అండగా ఉంటానిని తెలిపారు. వీరివెంట కూటమి మండల అధ్యక్షుడు కుమరావు రవికుమార్, పైల విష్ణుమూర్తి, మీసాల రవికుమార్, ఏఎంసీ ఉపాధ్యక్షులు బురాడ వెంకటరమణ, పిఏసీస్ అధ్యక్షులు బెవర జగన్నాధరావు, నక్క మురళీ, సర్పంచ్ ప్రతినిధి ముద్దాడ గౌరీ శంకరరావు, సి.గోవిందరావు పాల్గొన్నారు.

## వల్లూరులో గర్భిణులకు సామూహిక సీమంతాలు



**ఎచ్చెర్ల, డిసెంబరు 3(వార్త):** గర్భం దాల్చిన ప్రతి మహిళ వెంటనే అంగన్వాడీ కేంద్రాలలో పేరు నమోదు చేసుకోవాలని వల్లూరు అంగన్వాడీ టీచర్ పి.వెంకటలక్ష్మీ స్పష్టం చేశారు. సీడీపీవో ఆదేశాల మేరకు బుధవారం ఉదయం వల్లూరులోని అంగన్వాడీ కేంద్రంలో పలువురు గర్భిణులకు సామూహిక సీమంతం నిర్వహించారు. అనంతరం పౌష్టికాహారం అందజేశారు. అంగన్వాడీలో ఇచ్చే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. శిశువు, చిన్నపిల్లల ఆహారము అలవాట్లపైన, తల్లిపాలు ప్రాముఖ్యత గూర్చి, గర్భవతులు, బాలింతలకు, పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. సరైన ఆహారపు అలవాట్లు, క్రమం తప్పకుండా వ్యాయామానికి తోడు రోజువారీ పోషకాలతో కూడిన ఆహారం తీసుకుంటే ఆరోగ్యాన్ని పదిలంగా ఉంచుకోవచ్చని గర్భిణులకు సూచించారు. కార్యక్ర మంలో అంగన్వాడీ ఆయా, చిన్నారుల తల్లిదండ్రులు ఉన్నారు.

## పారిశుధ్య నిర్వహణలో భాగస్తులు కండి

**నరసన్నపేట, డిసెంబరు 3(వార్త):** పంచాయతీలలో నిర్వహిస్తున్న పారిశుధ్యం పట్ల ప్రజల భాగస్వామ్యం అవసరమని ఎంపీడీవో వెంకటేశ్వర ప్రసాద్ తెలిపారు. బుధవారం నరసన్నపేట మేజర్ పంచాయతీలో థియేటర్ యజమాన్యం, హొటల్స్ యాజమాన్యంతో సమీక్ష సమావేశం నిర్వహించారు. తప్పనిసరిగా పారిశుధ్యం పట్ల పూర్తి సహాయ సహకారాలు అందించాలన్నారు. అలాగే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తగు ఏర్పాట్లు చేయాలన్నారు.



# ఉద్యమాలను నిర్బంధిస్తే ప్రజా ఆగ్రహం తప్పదు

**శ్రీకాకుళం, డిసెంబరు 3(వార్త):** ప్రజా ఉద్యమాలపై ప్రభుత్వ నిర్బంధం ప్రయోగిస్తే ప్రజా ఆగ్రహానికి గురికాక తప్పదని సిపిఎం జిల్లా కార్యదర్శి డి గోవిందరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ, లిబరేషన్ జిల్లా కార్యదర్శి తామాడ సన్యాసిరావు, న్యూ డెమోక్రసీ జిల్లా ఉపాధ్యక్షులు వంకల మాధవరావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. స్థానిక సుందరయ్య భవనంలో వామపక్షాలు మరియు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ప్రజా ఉద్యమాలపై ప్రభుత్వ నిర్బంధాన్ని ఖండిస్తూ కోనారి. మోహన్ రావు అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా ఉద్యమాలపై నిర్బంధం ఎత్తివేయాలని రాజ్యాంగం కల్పించిన వాక్ స్వాతంత్రం, సభలు, సమావేశాలు పెట్టుకునే హక్కును కాపాడాలని రౌండ్ టేబుల్ సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. ఈ సందర్భంగా వామపక్ష ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లాలో ప్రజా ఉద్యమాలపై ఎందుకు నిర్బంధం ప్రయోగిస్తున్నారని జిల్లా మంత్రులను వారు ప్రశ్నించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రజాస్వామ్యం కావాలా అధికారంలోకి వచ్చిన తర్వాత ఎందుకు నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నారని వారు నిలదీశారు. ఈ కాలంలో కార్గో ఎయిర్పోర్ట్ రద్దు చేయాలని, థర్మల్ పవర్ ప్లాంట్ ప్రతిపాదనలు రద్దు చేయాలని కోరుతూ ధర్నాకు పిలిపిస్తే ధర్నాకు అనుమతులు నిరాకరిస్తూ ప్రజల పైన ప్రభుత్వం నిర్బంధాన్ని ప్రయోగించి అక్రమ అరెస్టులు కుఎందుకు పాల్పడ్డారని జిల్లా మంత్రులను ప్రశ్నించారు. నిర్బంధాలు ప్రయోగించిన ప్రభుత్వాలు కాలగర్భంలో కలిసి పోయావని మీరు ప్రయోగిస్తే మీ ప్రభుత్వాలకు అదే గతి పడుతుందని హెచ్చరించారు. ధర్నాలు, ప్రదర్శనలు నిరాకరించడం రాజ్యాంగ విరుద్ధమైనదని వారన్నారు. శ్రీకాకుళం జిల్లా తీరప్రాంతాన్ని ఆదానికి, మరో వైపున కార్గో ఎయిర్పోర్టుకి ఇంకొక వైపున అను విద్యుత్, థర్మల్ పవర్ ప్లాంట్ తో జిల్లాని ఎందుకు విధ్వంసానికి పూను కుంటున్నారు కేంద్ర మంత్రి కింజరాపు. రామ్మోహన్ నాయుడు ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజల ఆస్తులను కార్పొరేట్ కంపెనీలకు దోచిపెట్టడమే అభివృద్ధా అని ప్రశ్నించారు. నిర్బంధాలతో ఉద్యమాలు ఆపలేరని ప్రజా సమస్యలపై మరెన్నో ఐక్య ఉద్యమాలు ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రజా సంఘాల నాయకులు ఎయిర్పోర్ట్ వ్యతిరేక పోరాట కమిటీ అధ్యక్ష



కార్యదర్శులు కొమర .వాసు, జోగి. అప్పారావు, ఆదివాసి సంక్షేమ పరిషత్ నాయకులు వాబ.యోగిసిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.జేశ్వరరావు, పౌర హక్కుల సంఘం నాయకులు కేవీ .జగన్నాథం, థర్మల్ పవర్ ప్లాంట్ వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు సవర. సింహాచలం,శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ కే. నాగమణి, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పోలాకి .ప్రసాదరావు, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వెలమల. రమణ, ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి నిమ్మక .అప్పన్న, ఏఐ వైఎఫ్ జిల్లా నాయకులు ఎన్ శ్రీను, టి సంతోష్, పట్టణ పౌరు సంక్షేమ సంఘం కన్వీనర్ ఎన్. గోపి,పెన్షనర్ సంఘం జిల్లా నాయకులు ఎం ఆదినారాయణమూర్తి ఎస్ఎఫ్ఐ నాయకులు ఖగేష్ , కార్గో ఎయిర్పోర్ట్ వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు బత్తిని లక్ష్మణ రావు, దున్న హరికృష్ణ, రామస్వామి దిలీప్ దాసరి మోహన్రావు, థర్మల్ పవర్ ప్లాంట్ వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు రవికాంత్ తదితరులు పాల్గొన్నారు

# కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

**జి.సిగడాం, డిసెంబరు3(వార్త):** కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు ధాన్యం విక్రయించి ప్రభుత్వం మద్దతు ధర పొందాలని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వర రావు రైతులకు సూచించారు. బుధవారం జి.సిగడాం మండల రైతు సేవా కేంద్రం వేదిక ప్రాంగణంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వరి ధాన్యం క్వింటాల్‌కు ఏ గ్రేడ్ రకానికి రూ.2,389, సాధారణ రకానికి రూ.2,369 అందిస్తుందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని పెర్కోన్నారు..రైతులు తమ పంటను తక్కువ ధరకు వ్యాపారులకు అమ్ముకొని నష్టపోవద్దని సూచించారు.రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ అన్ని వసతులు కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ముద్దాడ ఈశ్వరమ్మ,కూటమి మండల అధ్యక్షులు కుమరావు రవికుమార్, పైలవిష్ణుమూర్తి,మీసాల రవికుమార్, ఎఎంసీ ఉపాధ్యాక్షులు బురాడ వెంకటరమణ, పీఎసీస్ అధ్యక్షులు బెవర జగన్నాధరావు, నక్క మురళీ బీజేపీ జిల్లా కార్యదర్శి వజ్జపర్తి రఘురాం, జనసేన జిల్లా నాయకులు భూపతి ఆర్జున్ కుమార్,తాళ్ల బత్తుల పైడిరాజు, టిడిపి సీనియర్ నాయకులు టంకాల మౌళీశ్వరరావు,భూపతి అర్జున్ కుమార్,తాళ్లబత్తుల పైడిరాజు, తహాశీల్దార్ ఎం.సరిత, ఎంపీడీఓ జి.రామకృష్ణారావు,ఎడీ వద్దాది శ్రీనివాసరావు,ఏఓ బి.బాజ్జీ, డీసీఎంస్ గొలివి వెంకటరమణ, సర్పంచ్ ప్రతినిధి ముద్దాడ గౌరీ శంకర్, నాయకులు మజ్జి కన్నం నాయుడు, సి.గోవిందరావు, మీసాల మోహన్, తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# రాష్ట్రస్థాయి కౌశల్ పోటీలకు సొండిపూడి విద్యార్థులు



**మందస, డిసెంబరు 3(వార్త):** రాష్ట్రస్థాయిలో జరిగే కౌశల్ పోటీలకు మందస మండలం సొండిపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఇటీవల జరిగిన కౌశల్ ప్రతిభ పోటీలలో శ్రీకాకుళం జిల్లా తరపున రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించి, మరో అరుదైన ఘనతను చాటుకున్నారు. క్విజ్, పోస్టర్, రీల్స్ విభాగాలలో జరిగిన పోటీలలో పదవ తరగతి చదువుతున్న తెలుకల నికిత, కొర్రాయి ఉష, తొమ్మిదవ తరగతి చదువుతున్న ఇళ్ల ధనలక్ష్మి, ఎనిమిదవ తరగతికి చెందిన నగిరి మహాశ్రీ జిల్లా జట్టులో స్థానం సంపాదించారు. డిసెంబర్ 27న తిరుపతిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో జిల్లా తరపున వీరు ప్రాతినిధ్యం చేయబోతున్నారు. ఈ పోటీల్లో విజయం సాధిస్తే, నేరుగా జాతీయస్థాయిలో పాల్గొంటారు. నలుగురు విద్యార్థినిలు గ్రామీణ ప్రాంతానికి చెందిన వారు కావడం గమనార్హం. మూలిపాడుకు చెందిన నాగేశ్వరరావు, మోహిని దంపతుల కుమార్తె నిఖిత, పింపిడియాకు చెందిన హరికృష్ణ, భారతీల కుమార్తె కొర్రాయి ఉష, సొండిపూడికి చెందిన శ్రీనివాసరావు, కమలల కుమార్తె ఇళ్ళ ధనలక్ష్మి, సొండిపూడికి చెందిన విద్యాకమిటీ మెంబర్ నగిరి విజయబాబు, వేణుల కుమార్తె నగిరి మహాశ్రీ వీళ్ళందరూ వ్యవసాయ పనులు చేసుకుంటూ మధ్యతరగతి కుటుంబానికి చెందినవారు. పోటీల్లో పాల్గొనబోయే విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుందర సోలమన్, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

# కత్తెర పురుగుతో జొన్న పంటకు తీవ్ర నష్టం

**జలుమూరు, డిసెంబరు 3(వార్త):** జలుమూరు మండలంలో జొన్న రైతులు తీవ్రమైన ఆవేదనలో ఉన్నారు. కరకవలస, మొకలింగం, నగరికటకం, కొమనాపల్లి, నదీ ప్రవాహ ప్రాంతాల్లో సుమారు 2,000 ఎకరాల్లో సాగు చేసిన జొన్న పంటపై కత్తెర పురుగు బీభత్సం సృష్టిస్తున్నా, అధికారులు మాత్రం కన్నెత్తి చూడని నిర్లక్ష్య ధోరణిపై రైతులు గుర్రుగా ఉన్నారు. మొక్కజొన్న, జొన్న పంటలకు భీకరంగా విస్తరిస్తున్న కత్తెర పురుగు దాడి రైతులను ఆర్థికంగా గజగజలాడిస్తోంది. ఈ పరిస్థితుల్లో కూడా ప్రభుత్వం పంటకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు సరఫరా చేయడంలో విఫలమైందని రైతులు ఆరోపిస్తున్నారు. తాజాగా జలుమూరు మండలంలో ఫెర్టిలైజర్లు మరియు పురుగుమందులు అమ్మే కొంతమంది వ్యాపారస్తులు ఎరువులు అధిక ధరకే విక్రయిస్తున్నారనే ఆరోపణలు వెలువడుతున్నాయి. సాధారణంగా ఉండాల్సిన యూరియా ధర ప్రస్తుతం ?450 నుండి ?550 వరకు, మరికొన్ని చోట్ల ?1500 వరకు అమ్ముతున్నట్టు రైతులు వెల్లడిస్తున్నారు. ఈ అధిక ధరలపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం రైతుల్లో తీవ్ర అసంతృప్తికి దారితీసింది. వ్యాపారులపై చర్యలు తీసుకుని ఎరువుల ధరలను నియంత్రించాలని రైతులు ప్రభుత్వాన్ని గట్టిగా కోరుతున్నారు. కాలతుఫాను ప్రభావంతో కత్తెర పురుగు తీవ్రత పెరిగినా, మందులకు ప్రభుత్వ సహాయం అందకపోవడం రైతులను మరింత ఆందోళనకు గురిచేస్తోంది. గిట్టుబాటు ధరలు లేకపోవడం, ఇన్‌పుట్ ఖర్చులు పెరగడం, అధికారులు సహాయం లేఖపోవడం కలిపి రైతులను తీవ్ర ఇబ్బందుల్లోకి నెట్టేస్తున్నాయి. "పంట నాశనం అవుతున్నా%ొ% అధికారులు మాత్రం కనిపించడం లేదు. మా సమస్యలు ఎవ్వరు పట్టించుకోవడం లేదు" అని రైతులు వేదన వ్యక్తం చేస్తున్నారు. అత్యవసర సహాయం, సరసమైన ధరలకు ఎరువులు%-%పురుగుమందులు అందుబాటులో పెట్టాలని, క్రమబద్ధమైన పర్యవేక్షణ చేయాలని ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.



# కోటబొమ్మాళిలో జేసీ ఆకస్మిక తనిఖీలు



**శ్రీకాకుళం, డిసెంబరు 3(వార్త):** జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ బుధవారం కోటబొమ్మాళి మండలంలో ఆకస్మికంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన స్థానికంగా ఉన్న రైస్ మిల్లులు, ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేసి, వాటి నిర్వహణ తీరును పరిశీలించారు. మండలంలోని బోయిన ద్వారకా నాథ్, వెంకటలక్ష్మి, వెంకట సరోజ రైస్ మిల్లులను జేసీ సందర్శించారు. మిల్లుల్లోని ధాన్యం నిల్వ పాయింట్లను, కొనుగోలుకు సంబంధించిన రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. మిల్లుల నిర్వహణ తీరు, మిల్లింగ్ ప్రక్రియ వేగంపై యాజమాన్యాలతో మాట్లాడి వివరాలు సేకరించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ధాన్యం నిల్వలను పక్కాగా నిర్వహించాలని, రికార్డులను ఎప్పటికప్పుడు సరిగా నమోదు చేయాలని ఆయన ఆదేశించారు. అనంతరం, చీపుర్లపాడు, జర్జంగి గ్రామాలలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను (పీపీసీ సెంటర్లు) కూడా జేసీ తనిఖీ చేశారు. కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్ల పురోగతిని, నాణ్యతా ప్రమాణాల అమలును సమీక్షించారు. రైతులు పండించిన పంటకు సరైన ధర లభించేలా, కొనుగోలు ప్రక్రియలో వారికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సిబ్బంది అప్రమత్తంగా పనిచేయాలని ఆయన స్పష్టం చేశారు. ఆయన వెంట ఆర్డిఓ కృష్ణమూర్తి, తహసిల్దార్ ఆర్ అప్పలరాజు ఉన్నారు.

## దివ్యాంగ విద్యార్థులకు ప్లేట్లు..గ్లాసుల పంపిణీ



**మెళియాపుట్టి, డిసెంబరు 3(వార్త):** మెళియాపుట్టి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గల భవిత కేంద్రం వద్ద 30 మంది దివ్యాంగ విద్యార్థులకు భోజన ప్లేట్లు, గ్లాసులు, గిన్నెలు పలకలు, స్లేట్ పెన్సిల్స్, కేక్, స్వీట్స్ లను పూర్వపు మండల దేశం పార్టీ అధ్యక్షులు, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అనపాన రాజశేఖర్ రెడ్డి అందజేశారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా సహిత ఉపాధ్యాయులు ఎన్.ఝాన్సీరాణి, పి.శివప్రసాద్ ల నేతృత్వంలో మండల కేంద్రంలో గల స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో భవిత కేంద్రం వద్ద ఏర్పాటు చేసుకున్న దివ్యాంగుల దినోత్సవ కార్యక్రమాన్ని బుధవారం నాడు నిర్వహించారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ సందర్భంగా విద్యార్థులకు సంబంధించి రాజశేఖర్ రెడ్డి వివిధ అంశాలపై మాట్లాడారు. అనంతరం మండల విద్యాశాఖధికారి మల్లారెడ్డి పద్మనాభం, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డి. మహాలక్ష్మి, స్కూల్ కమిటీ చైర్మన్ బురగాన చిన్నబాబులు కలిసి దివ్యాంగ విద్యార్థులకు భోజన ప్లేట్లు, గ్లాసులు, గిన్నెలు పలకలు, స్లేట్ పెన్సిల్స్, కేక్, స్వీట్ లను అందజేశారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు స్కూల్ కమిటీ వైస్ చైర్మన్ అలచంద్ర స్వప్న, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు దుక్క శంకర్ రెడ్డి, గాలి రామారావు, గాలి రామకృష్ణా, దివ్యాంగ విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## దివ్యాంగ విద్యార్థులకు బ్లాక్ బోర్డ్ వితరణ



**మెళియాపుట్టి, డిసెంబరు 3(వార్త):** మెళియాపుట్టి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బ్లాక్ బోర్డును గిరిజన సంఘ నాయకురాలు బైరిసింగి ధరణి ఉపాధ్యాయులకు అందించారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా సహిత ఉపాధ్యాయులు ఎన్.ఝాన్సీరాణి, పి.శివప్రసాద్ ల నేతృత్వంలో మండల కేంద్రంలో గల స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో భవిత కేంద్రం వద్ద ఏర్పాటు చేసుకున్న దివ్యాంగుల దినోత్సవ కార్యక్రమాన్ని బుధవారం నాడు నిర్వహించారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ సందర్భంగా విద్యార్థుల విద్యాభివృద్ధికి తన వంతు సహకారంగా తరగతి గదికి సంబంధించిన బ్లాక్ బోర్డ్ ను గిరిజన సంఘ నాయకురాలు ధరణి ఉపాధ్యాయులకు, స్కూల్ కమిటీ చైర్మన్ బురగాన చిన్నబాబులకు కలిసి అందజేశారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు స్కూల్ కమిటీ వైస్ చైర్మన్ అలచంద్ర స్వప్న, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, దివ్యాంగ విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికే రైతన్న మీకోసం



**మెళియాపుట్టి, డిసెంబరు 3(వార్త):** గ్రామాలలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించే ధ్యేయంతో కూటమి ప్రభుత్వం రైతన్న మీకోసం కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందని గ్రామాలలో ఉన్న రైతాంగ సమస్యలను పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందని వసుంధర సర్పంచు సలాన అప్పలనాయుడు అన్నారు. మెళియాపుట్టి మండలంలో గల వసుంధర గ్రామంలో బుధవారం నాడు రైతున్నా%-%మీ కోసం కార్యక్రమం నిర్వహించారు. రైతన్నల దగ్గరికి వెళ్లి రైతన్న మీకోసం కార్యక్రమం గురించి అనేక అంశాలపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వారితో పాటుగా బిజెపి పార్టీ నాయకులు సలాన రాఘవరావు, దేశం పార్టీ సీనియర్ నాయకులు బోచ్చు లక్ష్మణరావు, నడసంద్ర సర్పంచ్ ప్రతినిధి సంతోష్ మజ్జి, ఏఎంసి డైరెక్టర్ చింతల ప్రశాంత్, వ్యవసాయ శాఖ అధికారులు ప్రభావతి, రెవెన్యూ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, రైతులు, గ్రామస్తులు తదితరులున్నారు.

## బాబూ రాజేంద్రప్రసాద్ జయంతి వేడుకలు

**ఇచ్ఛాపురం, డిసెంబరు 3(వార్త):** శాంతినికేతన్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ లో బాబు రాజేంద్ర ప్రసాద్ జయంతి సందర్భంగా స్కూల్ చైర్మన్ డి. కృష్ణమూర్తి రెడ్డి బాబు రాజేంద్ర ప్రసాద్ చిత్రపటానికి పూలమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ మేనేజర్ కే.సి. పూరి ఉపాధ్యాయులు రవి, పద్మజ, రాజ్యలక్ష్మి, జయలక్ష్మి, ప్రమీల, పార్వతి, శిరీష, ఎస్ పి యల్స్ యువ శ్రీ, జిహారిక ఇంటరాక్ట్ క్లబ్ ప్రెసిడెంట్ మోహన్ ప్రియ, సెక్రటరీ డి. హర్షవర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## ప్రతిభను ప్రోత్సహించడమే లక్ష్యం



**సోంపేట, డిసెంబరు 3(వార్త):** విద్యార్థులలో ప్రతిభను గుర్తించి వారిని మరింతగా ప్రోత్సహించడమే తన ఉద్దేశమని కంచిలి మండలం వైసిపి కన్వీనర్ వజ్జ మృత్యుంజయం పేర్కొన్నారు. మకరం పురం జడ్పీ ఉన్నత పాఠశాలలో గత ఏడాది పదవ తరగతిలో పబ్లిక్ పరీక్షల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు మృత్యుంజయరావు నగదు బహుమతులు అందజేశారు. ప్రథమ స్థానంలో నిలిచిన కోరికాన మౌనికకు 5000 రూపాయలు, ద్వితీయ స్థానంలో నిలిచిన వజ్జ అన్వేష్కు 3000 రూపాయలు, తృతీయ స్థానంలో నిలిచిన కోరికన లాస్యకు ?2,000 నగదును బుధవారం పాఠశాల ఆవరణలో ప్రధానోపాధ్యాయులు చింతాడ అప్పలరాజు ఆధ్వర్యంలో అందజేశారు. ప్రతిభ సాధించిన విద్యార్థులను అభినందించారు.

ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ ఏలుసూరి అప్పారావు, గ్రామస్తులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

### - ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

**పోలాకి, డిసెంబరు 3(వార్త):** పోలాకి మండలంలోని దీర్ఘాసి గ్రామంలో "రైతన్న - మీకోసం" కార్యక్రమానికి ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి శ్రీకారం చుట్టి గ్రామంలో రైతుల ఇంటింటికి వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వ్యవసాయం రాష్ట్ర బలం%ొ% అన్నదాతకు అండగా మన మంచి ప్రభుత్వమేనని, నీటిభద్రత నుండి అగ్రిటెక్ వరకు%ొ% 20 వేల రూపాయల వార్షిక సాయం వరకు రైతు అభ్యున్నతే కూటమి లక్ష్మమని రైతులతో ప్రత్యక్షంగా మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన అన్నదాతలకు హృదయపూర్వక నమస్కారాలు తెలుపుతూ, వ్యవసాయం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు మూలస్తంభమని, తమ ప్రభుత్వం రైతు రాజ్య స్థాపన కోసం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు."నేనూ రైతు బిడ్డనే%ొ% రైతు ఎకరాలో ఏం సమస్య ఉంటుందో నాకు తెలుసు,అందుకే రాబోయే 5 సంవత్సరాల్లో రైతుని రాజును చేయడానికి ప్రభుత్వం నీటిభద్రత, పంటల మార్పిడి, అగ్రిటెక్ ప్రోత్సాహం, ప్రకృతి వ్యవసాయం, యాంత్రీకరణ అనే 5 ప్రధాన విధానాలతో ముందుకు సాగుతోంది" అని తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం చేపట్టిన కీలక చర్యలను వివరించారు.అన్నదాత సుఖీభవ %- ( పీ% కిసాన్ ద్వారా సంవత్సరానికి ?20,000 సహాయం, రెండు విడతల్లో ?6300 కోట్లకు పైగా నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేయడం జరిగిందన్నారు. డ్రిప్%-%స్ప్రింక్లర్లపై 70% నుండి 100% వరకు సబ్సిడీ, ఇవ్వడం జరుగుతుంది అన్నారు.ఖరీఫ్ %ఁ% రబీకి రాయితీ విత్తనాల పంపిణీ, ఉద్యాన పంటలకు ఫ్రూట్ కేర్ ద్వారా అదనపు ఆదాయం. ధాన్యం, ఉల్లి, మామిడి, కోకో, పొగాకు వంటి పంటల కొనుగోలుకు ప్రభుత్వం నుండి పెద్ద ఎత్తున మద్దతు, కిసాన్ డ్రోన్లు, శాటిలైట్ సర్వే, డీప్ టెక్ ఆధారంగా పంటల పరిశీలన,పశు సంవర్ధక %ఁ% ఆక్వా రైతులకు ప్రత్యేక సబ్సిడీలు, విద్యుత్ రాయితీలు,అదే విధంగా గ్రామస్థాయిలో జరుగుతున్న "పొలం పిలుస్తోంది" కార్యక్రమం ద్వారా 40 వేల గ్రామాల్లో 11 లక్షల మంది రైతులకు ప్రత్యక్ష సలహాలు అందుతున్నాయని తెలిపారు."అన్నదాత నవ్వితేనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నవ్వుతుంది. మీ ప్రతి ఎకరాకు నీరు, మీ ప్రతి ఇంటికి ఆదాయం, మీ ప్రతి పంటకు గిట్టుబాటు ధర ఁ ఇది మన ప్రభుత్వ వాగ్దానం కాదుని భరోసా" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాలింగ కార్పొరేషన్ చైర్మన్ రోనంకి కృష్ణన్నాయుడు, మండల పార్టీ అధ్యక్షులు మిరియాపల్లి వెంకటప్పలనాయుడు, పోలాకి పిఏసిఎస్ చైర్మన్ బైరి.భాస్కర్ రావు, పల్లి సూరిబాబు, చిట్టి సింహాచలం, లుకలాపు.చిన్నబాబు, తెంబూరు.చిన్నబాబు, మరియు గ్రామ పెద్దలు మండల నాయకులు కార్యకర్తలు అధికారులు పాల్గొన్నారు.



## పలాస | నిత్యావసరాల పంపిణీ



**పలాస, డిసెంబరు 3(వార్త):** మొంథా తుఫాన్ వల్ల నష్టపోయిన మత్స్యకారుల కుటుంబాలకు పలాస శాసన సభ్యులు గౌతు శిరీష నిత్యావసర సరుకులు బుధవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఇటీవలి మొంథా తుఫాన్ వల్ల ప్రభావితమైన మత్స్యకారుల కుటుంబాల పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని, రాష్ట్ర ప్రభుత్వం మానవతా దృక్పథంతో ముందుకొచ్చిందాని అన్నారు. బాధితులకు ఆహార ధాన్యాలు, నిత్యవసర సరుకులు, అవసరమైన గృహోపకరణాలు తదితర సహాయ సామగ్రిని, ప్రభుత్వం తరపున అందజేసి, వారిని ఆదుకునే చర్యలు చేపట్టిందాని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా తుఫాన్ ప్రభావం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్న మత్స్యకారులకు తక్షణ ఉపశమనం కల్పించడమే లక్ష్యమాని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏపీ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబురావు, పలాస ఏఎంసీ చైర్మన్ మల్లా శ్రీనివాసరావు, టిడిపి నాయకులు శశి భూషణ్, పుచ్చ దుర్యోధన, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే గౌతును కలిసిన ఎన్జీవో నాయకులు



**పలాస, డిసెంబరు 3(వార్త):** ఎమ్మెల్యే కార్యాలయం నందు నూతనముగా ఎన్నికబడిన ఏపీఎన్జీ జీవోస్ అసోసియేషన్ మర్యాదపూర్వకంగా బుధవారం కలవడం జరిగింది. నూతన అసోసియేషన్ ని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అభినందించారు. కాశిబుగ్గ హై స్కూల్ రోడ్ నందు అసంపూర్ణంగా ఉన్న ఎన్జీ హోమ్ నిధులు విడుదల చేయాలని వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా గౌతు శిరీష మాట్లాడుతూ సాధ్యసాధ్యాలు పరిశీలించి నిధులు విడుదల చేస్తామని సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులుబోనెల గోపాల్, కౌన్సిలర్, సీనియర్ నాయకులు దువ్వాడ శ్రీకాంత్, ఉపాధ్యక్షులు పొట్నూరు శ్రీనివాసరావు, పంచాయతీ అధికారి పి.సద్గుణ బాబు, మున్సిపల్ అధికారి ఉదయ్ శంకర్ పాత్రో, ఐసిడిఎస్ అధికారి యు లత, వెటర్నరీ లైవ్ స్టాక్ అధికారి కొర్ల కళ్యాణ్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

## విశ్రాంత సైనికుడికి ఘన స్వాగతం



**పలాస, డిసెంబరు 3(వార్త):** పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో గల మొగలిపాడు గ్రామంలో విశ్రాంత సైనికుడు బొర్ర శ్యామ సుందరరావుకు గ్రామస్తులు ఘనంగా పూలమాల, దుస్సాలువతో సత్కరించి బుధవారం ఆహ్వానం పలికారు. 25 సంవత్సరాలు దేశ సేవలో నిమగ్నమై, చివరగా గుజరాత్ లో హవల్దారుగా బాధ్యతలు నిర్వర్తిస్తూ నేడు ఉద్యోగ విరమణ పొంది స్వగ్రామము అయినా మొగలిపాడు గ్రామానికి చేరుకున్నారు.ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పొలిమేరకు చేరుకొని ఘనంగా సత్కరించి స్వాగతం పలికారు. గ్రామంలోకి నడిచేటపుడు రోడ్డుకు ఇరువైపులా పాఠశాల విద్యార్థులు నుంచుని పూలతో వారిని ఆహ్వానించారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## టైలర్ల సంఘం సహాయం

**సోంపేట, డిసెంబరు 3(వార్త):** ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన సోంపేట పట్టణం సీతారాంపేట వీధి శివారున నివసిస్తున్న టైలర్ సింహాచలం కృష్ణారావు మృతి చెందడంతో ఆ కుటుంబానికి సోంపేట శ్రీ లోకనాధేశ్వర కుట్టుపని సంక్షేమ సంఘం అండగా నిలిచింది. ఈ మేరకు బుధవారం మృతుని కుటుంబానికి 5600 రూపాయల నగదు సహాయంతో పాటు 1600 రూపాయల విలువైన కిరాణా సామాన్లు, 25 కిలోల బియ్యం ప్యాకెట్టు మృతుడి భార్య నారాయణమ్మకు అందజేశారు. ఈ కార్యక్రమంలో షావుకారి జానీ, తేజేశ్వరరావు పలువురు టైలర్లు పాల్గొన్నారు.



# మన డబ్బులు..మన లెక్కలపై గ్రామాల్లో అవగాహన

**మందస, డిసెంబరు 3(వార్త):** ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొని మహిళా సంఘాల ఆర్థిక లావాదేవీలు సంఘ సభ్యులందరికీ పూర్తి అవగాహన కలిగి ఉండడానికి రాష్ట్ర గ్రామీణ పేదరిక నిర్మూలనా సంస్థ ఆదేశాల మేరకు గ్రామ గ్రామాన మహిళా సంఘ సభ్యులకు అవగాహన కల్పిస్తున్నట్లు వెలుగు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. మఖరజోల, అంబుగాంబొడ్లూరు, వీరభద్ర, హరిపురం, ముకుందపురం, బిన్నలమదనాపురం తదితర అన్ని గ్రామాలలో మహిళా సంఘాలు ముమ్మరంగా సమావేశాలు జరిపించుకుని సంఘం పెట్టిన నుండి పొదుపులు, వాడుకున్న అప్పులు, ఇంటర్నల్ లెండింగ్ వలన సంఘానికి వచ్చిన వడ్డీలు, ప్రభుత్వం ద్వారా వివిధ స్థాయిలలో వచ్చిన రాయితీలు తదితర అన్ని విధాలైన సంఘం ఆర్థిక లావాదేవీలను మన డబ్బులు మన లెక్కలు కార్యక్రమంలో పూర్తిస్థాయిలో అన్ని ఆర్థిక లావాదేవీలపై సంఘ సభ్యులందరూ చర్చించుకుంటూ రికార్డుల్లో నమోదు చేసుకుంటున్నారు. కార్యక్రమంపై మరింత విస్తృతంగా గ్రామాల్లో అవగాహన కల్పించడానికి సంఘ సభ్యురాలుగా ఉంటూ విద్యావంతురాలై చురుకుగా పని చేయగలిగిన వారిని రిసోర్స్ పర్సన్స్ గా, గుర్తించి తగు శిక్షణ ఇప్పించి శత శాతం గ్రామాల్లో అన్ని సంఘాలలో సభ్యులందరికీ ఆర్థిక లావాదేవీలపై ముందు ముందు అవగాహన కల్పిస్తున్నట్లు కూడా వివరించారు. కార్యక్రమంలో గ్రామ సంఘాల ప్రతినిధులు, స్వయం శక్తి సంఘాల లీడర్లు, సభ్యులు, వీఓఏలు పాల్గొన్నారు.



# 22న కామ్రేడ్ సుబ్బారావు పాణిగ్రాహి సంస్మరణ సభ



**పలాస, డిసెంబరు 3(వార్త):** శ్రీకాకుళం గిరిజన రైతాంగ పోరాట సాంస్కృతిక యోధుడు, ప్రజా కళాకారుడు కామ్రేడ్ సుబ్బారావు పాణిగ్రహి సంస్మరణ సభ ఈ నెల 22న బొడ్డపాడు గ్రామంలో అమరుల స్మారక మందిరంలో జరగనుందని, ఈ సభను విజయవంతం చేయాలని బుధవారం ప్రజా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఈ సంక్షోభ కాలంలో కవిగా రచయితగా వాయిద్య కారుడిగా, పాటగాడిగా, ఆటగాడిగా, పోరాట వీరుడుగా విభిన్న పాత్రల పోషించిన సాంస్కృతిక యోధుడి సభను నిర్వహించడం అంటే..?? ఆ వీరుని జ్ఞాపకాలను సాంస్కృతిక స్ఫూర్తిని నేటి తరానికి అందించడమెన్నారు. మానవ విలువలన్నీ ఆర్థిక సంబంధాలుగా మారి సామ్రాజ్యవాద విష సంస్కృతి విజృంభిస్తున్న వేళ.. ప్రజా కళలు కాపాడుకుందామాని విప్లవ అభిమానులు పిలుపునిచ్చారు. ప్రత్యామ్నాయ ప్రజా సంస్కృతిని స్థాపిద్దాం.. అన్న నినాదంతో పోరాడుతున్న ప్రజా కళామండలి కామ్రేడ్ సుబ్బారావు పాణిగ్రహమ్రత్వాన్ని ఎత్తి పడుతూ.. ఆధిపత్య సాంస్కృతి స్థానంలో.. ప్రజా సంస్కృతిని వ్యాప్తి చేయడం కోసం.. ఈ సభను జరుపుతుందాని వెల్లడించారు. పలాస మండలం బొడ్డపాడులో జరిగే ఈసభను ఉద్దాన ప్రజలు ప్రజాస్వామికవాదులు, బుద్ధి జీవులు, మేధావులు, కవులు, కళాకారులు విజయవంతం చేయాలని కోరుతున్నాం. బుధవారం నిర్వహించిన కరపత్ర ఆవిష్కరణలో ప్రజా కళామండలి జిల్లా అధ్యక్షుడు రాపాక చిరంజీవిలు, సాలినా కుమార్, బుట్ట శ్రీరాములు, శ్రీకాంత్, ప్రజా కళా మండలి రాష్ట్ర సహాయ కార్యదర్శి కే నీలకంఠ%శీ%, న్యూడెమోక్రసీ పార్టీ నాయకులు గోరకల బాలకృష్ణ, రాపాక మాధవరావు, పి వై నాయకులు జగన్, జన సంస్కృతి మండలి జగదీష్ బొడ్డపాడు యువజన సంఘం కైలాస్, పిడిఎఫ్ మిత్రులు బాలకృష్ణ, దీపు మురళి,పి ఓ డబ్ల్యు జిల్లా అధ్యక్షురాలు పోతనపల్లి కుసుమ, సామాజిక కార్యకర్త పోతనపల్లి అరుణ, ప్రజా కళాకారుడు అమ్మ రామకృష్ణ, మద్దిల కైలాస్ దీపు మురళి తదితరులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాలు వద్దు..జీవితం ముద్దు




**పలాస, డిసెంబరు 3(వార్త):**మాదకద్రవ్యాలు వద్దు..జీవితం ముద్దు అని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రమేష్, పోలీస్ శక్తి టీం సిబ్బంది బైరాగి, ధనలక్ష్మి, వాసుదేవ్ అన్నారు. బుధవారం వజ్రపుకొత్తూరు మండలం పూండి గోవిందపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల వాలంటరీలు ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మూడో రోజు డ్రగ్స్ పై ర్యాలీ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నతనంలో ఆల్కహాల్, డ్రగ్స్ అలవాటు పడి జీవితాలు నాశనం చేసుకొని కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని అన్నారు. ఈ వయస్సులో మీరు శ్రద్ధగా చదువుపై దృష్టి సారించి ఉన్నత శిఖరాలుకు ఎదగాలని అన్నారు. మీరు చేస్తున్న ప్రతీ ఒక్క తప్పుకి చట్టాలు కఠినంగా ఉన్నాయని, ఆచితూచి నడుచుకోవలని అన్నారు. చేదు పోయిన జీవితం మరి వెనక్కి రాదని, ఉన్నపుడే జీవితం సరిదిద్దుకోవలని కోరారు. సాయంత్రం పాఠశాల పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించారు. వాలంటరీ లు చే సెమినార్ తరగతులు చేపట్టారు. చిన్నారులకు అట లపోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవో ఎస్ రూప్ సుందర్, అధ్యాపకులు కేశవరావు, ఝాన్సి శోభ, భాగ్యలక్ష్మి, ఆలేఖ్య, సౌజన్య, వాణి, రమణ, పున్నయ్య తదితరులు ఉన్నారు.

# అధికారులు వచ్చారు..కేంద్రం తెరిచారు

### -ఇదీ బుడితి జంక్షన్ డిజైన్ డెవలప్మెంట్ వర్క్షాప్ పరిస్థితి

### -సిబ్బందిపై స్థానికుల ఆగ్రహం

**సారవకోట, డిసెంబరు 3(వార్త):** బుడితి జంక్షన్లో ఏర్పాటు చేసిన డిజైన్ డెవలప్మెంట్ వర్క్షాప్ నేడు హఠాత్తుగా తెరవడం స్థానికుల్లో చర్చనీయాంశమైంది. జిల్లా అధికారులు రాబోతున్నారనే సమాచారం వెల్లడి కావడంతో నెలల తరబడి మూసివున్న శిక్షణ కేంద్రం ఒక్క రోజు ముందే తెరవబడింది. అధికారుల పర్యటన నేపథ్యంలో బుధవారం ప్రత్యేక ట్రైనింగ్ ప్రోగ్రాం ఏర్పాటు చేసినట్లు సంబంధిత విభాగం చెబుతోంది. అయితే, ఈ మధ్యకాలంలో కేంద్రం తలుపులు కూడా తెరుచుకోలేదని గ్రామస్థులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. అక్టోబర్ 29 నుండి డిసెంబర్ 28 వరకు శిక్షణ కార్యక్రమం జరుగుతుందని రికార్డులో చూపుతున్నప్పటికీ, అసలు ఈ వ్యవధిలో కార్యకలాపాలు సాగేలా ఎలాంటి సూచనలు కనిపించలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.



"కలెక్టర్ వస్తున్నారని తెలిసి మాత్రమే ఇవాళ కేంద్రం తలుపులు తెరిచారు. ఇది పూర్తిగా చూపు కోసం చేస్తున్న కార్యక్రమం," అని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రాజెక్ట్ నిజస్వరూపంపై విచారణ జరిపి, కేంద్రాన్ని సక్రమంగా నిర్వహించేలా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

## పంటలపై కార్యాచరణ | ఇచ్చాపురం



**ఇచ్ఛాపురం, డిసెంబరు 3(వార్త):** రైతు సేవా కేంద్రాల స్థాయిల్లో "రైతు మీ కోసం" కార్యక్రమాలు నిర్వహించి, 2025 రబీ, 2026 ఖరీఫ్, 2026 రబీ సీజన్ల కోసం పెంపు చర్యాపథకాలు కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేసినట్లు వ్యవసాయ అధికారి అజయ్ కుమార్ చెప్పారు. ప్రతి కేంద్రం పరిధిలో పంటల వారీగా నీటి వినియోగం, ఎరువుల వినియోగం, సహజ వ్యవసాయం ప్రోత్సాహం, యంత్రాంగ వినియోగం, పంటల విలువ వృద్ధి వంటి అంశాలపై ప్రత్యేక కార్యాచరణలను రూపొందించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖతో పాటు అన్ని అనుబంధ శాఖలు కలిసి పాల్గొన్నాయి. ఈదుపురం వద్ద నిర్వహించిన సమావేశంలో పాల్గొని, రైతు కుటుంబాల ఆదాయం పెంపుకు అనుసరించాల్సిన కీలక చర్యలను వివరించారు. అధికారులు, సిబ్బంది మరియు రైతులు కలిసి కేంద్రం స్థాయిలో అమలు చేయాల్సిన లక్ష్యాలు, రోజువారీ పర్యవేక్షణ విధానాలు, పంటల ఉత్పాదకత పెంపు చర్యలను చర్చించారు.రైతుల అవగాహన, ఫీల్డ్ లెవెల్ మానిటరింగ్, సమగ్ర వ్యవసాయ అభివృద్ధి లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.

## ఫ్యామిలీ క్రిస్మస్ వేడుకలు




**ఇచ్ఛాపురం, డిసెంబరు 3(వార్త):** ప్రత్తి విజయ కుమార్ స్వగృహం ఇచ్ఛాపురం లో పాస్టర్స్ కుటుంబాలు మరియు సంఘ పెద్దలు ఆహ్వానిస్తూ ఫ్యామిలీ క్రిస్మస్ వేడుకలు ఘనముగా నిర్వహించారు. రాజమండ్రి నుండి దైవ సేవకులు పాస్టర్ సంతోష్ రెడ్డి క్రిస్మస్ వర్తమానం అందించారు. రెవ. యు. వి. జాన్ సన్, ఆంధ్ర బాప్టిస్ట్ చర్చి, సభ అధ్యక్షులు గా నిర్వహించారు. మొదటి పలుకులు ప్రత్తి విజయ కుమార్ , అన్వేష్ తెలియజేశారు, శుభాకాంక్షలు బిషప్. కొత్తపల్లి. అబ్రహం ప్రకాశ్ బాబు , హెబ్రోన్ మిషన్ స్కూల్ డైరెక్టర్. జాన్ వెస్లీ , రెవ. అప్పాజీ , బెనర్జీ అందించారు, అనేకమంది దైవ సేవకులు, పెద్దలు కుటుంబాలతో సుమారుగా నాలుగు వందల మంది పాల్గొన్నారు,ప్రత్యేకముగా దైవ సేవకులు కుటుంబాలకు క్రిస్మస్ బహుమతులు అందించిరి, క్రిస్మస్ కేక్ కటింగ్,క్యాండిల్ సర్వీస్ తో క్రిస్మస్ పాటలతో ఘనంగా ముగించారు.

## డిగ్రీ కళాశాలను సందర్శించిన మద్రాస్ ఐఐటి కెమిస్ట్రీ ప్రొఫెసర్



**ఇచ్ఛాపురం, డిసెంబరు 3(వార్త):** మద్రాస్ ఐఐటి ప్రొఫెసర్ డాక్టర్ రాజకుమార్ బల్ల ఇచ్ఛాపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సందర్శించి, విద్యార్థులను ఉద్దేశించి, ఐఐటి లలో చదివితే విద్యార్థుల ఉజ్వల భవిష్యత్ ఎలా ఉంటుందో తన ప్రసంగంలో తెలియజేసారు. ఈ కళాశాల నుంచి ఐఐటి లలో షీట్ లు సాధించిన ముగ్గురు విద్యార్థులు అయిన గుడియా జ్యోతి, బాకీ ఈశ్వరి, పూజిత బాధిత్య లను అభినందించారు. దీనికి కృషి చేసిన కెమిస్ట్రీ లెక్చరర్ శివకుమార్ ను అభినందించారు. భవిష్యత్ లో ఈ కళాశాల నుండి అధిక సంఖ్యలో ఐఐటి లలో షీట్ లు సాధించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమం లో కళాశాల ప్రిన్సిపాల్. శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ దుర్యోదన దోలాయి, అధ్యాపకులు సీతమ్మ, సంతోష్ కుమార్, మోహన్ రావు, త్రిపాఠీ, శాంతా, ఈశ్వర్ రావు, రాధా, లోకేష్, బృందావనం, దేవరాజు, భగవతి, విద్యార్థులు పాల్గొన్నారు.

## హెూటళ్లలో పరిశుభ్రత పాటించాలి



**ఇచ్ఛాపురం, డిసెంబరు 3(వార్త):** ఇచ్ఛాపురం పురపాలక సంఘం కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ రమేష్ ఆధ్వర్యంలో పట్టణ పరిధిలోని టిఫిన్, హెూటల్, ఫాస్ట్ ఫుడ్ మొదలగు తినుబండారాల షాపు యజమానులతో సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల అనుసరించి, ఇటీవల జిల్లాలో ప్రబలుతున్న డయేరియా వ్యాధి కేసులు కారణంగా పట్టణ పరిధిలోని అన్ని హెూటల్, టిఫిన్, ఫాస్ట్ ఫుడ్ షాప్ యజమానులు అందరూ కూడా తినుబండారాలు నిల్వ చేయరాదని, తినుబండారాలపై మూతలు వేయాలని, వేడి నీళ్లు వినియోగదారులకు ఇవ్వాలని, షాపు పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచాలని కమిషనర్ సూచించారు. లేనిచో తగిన చర్యలు తీసుకోబడునని తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్ ఉపేంద్ర కుమార్ , సచివాలయ పర్యావరణ కార్యదర్శులు, హెూటల్ యూనియన్ ప్రెసిడెంట్,వైస్ ప్రెసిడెంట్, హెూటల్ యజమానులు పాల్గొన్నారు.

## 16 వ వార్డులో వైస్సార్సీపీ సంతకాల సేకరణ

**ఇచ్ఛాపురం, డిసెంబరు 3(వార్త):** మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి 17 గవర్నమెంట్ మెడికల్ కాలేజ్లు పెట్టిన వాటిని ఇప్పుడు ప్రైవేటీకరణ చెయ్యిబోతున్న వాటికి వ్యతిరేకం గా ఆంధ్రా ప్రజలు కోటి సంతకాలు సేకరణ లో భాగం గా శ్రీకాకుళం ఇచ్ఛాపురం మున్సిపాలిటీ 16 వ వార్డు లో మహిళా జూనియర్ కళాశాల వద్ద రచ్చబండ కార్యక్రమం ఏర్పాటు చేసి సంతకాలు సేకరణ చెయ్యటం జరిగింది.



కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లా మహిళా అధ్యక్షురాలు, మున్సిపల్ వైస్ చైర్పర్సన్ ఉలాల భారతి దివ్య, టౌన్ ప్రెసిడెంట్ బలివాడ ప్రకాష్ పట్నాయక్, 1 వార్డు కౌన్సిలర్ సుగ్గు ప్రేమ్ కుమార్, 9వ వార్డు కౌన్సిలర్ బచ్చు జగన్, 1వ వార్డు కౌన్సిలర్ ప్రతినిధి సాలీనా డిల్లీ రావు, 22 వ వార్డు కౌన్సిలర్ ప్రతినిధి కాళ్ళ సత్యం, మహిళా విభాగం ఇచ్ఛాపురం టౌన్ ప్రెసిడెంట్ మోతి ముంతాజ్, 16 వ వార్డు కమిటీ ప్రెసి డెంట్ సవ్వాడ సావిత్రి, వార్డు మహిళా విభాగం ప్రెసిడెంట్ తెలుకుల కల్పన తదితరులు పాల్గొన్నారు.




## విభిన్న ప్రతిభావంతులకు అల్పాహారం పంపిణీ

**పలాస, డిసెంబరు 3(వార్త):** దివ్యాంగుల లేదా అంకవైకల్యం కలవారు దినోత్సవం సందర్భంగా, గౌరవ అధ్యక్షులు, మండల న్యాయ సేవా సంఘం, జూనియర్ సివిల్ జడ్జ్ పలాస వారి సూచనలపై, మండల న్యాయ సేవా సంఘం, బుధవారం పలాస వారిద్వారా పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని, రైల్వే కోలనీ వద్ద, దివ్యాంగులకు, వారికి ఉచిత న్యాయ సహాయం అందుబాటులో ఉన్నదని, అదేవిధంగా ఉచిత న్యాయ సేవలు కొరకై టోల్ ఫ్రీ నెంబర్ 15100 నెంబర్ కి కూడా ఫోన్ చేసి ఉచిత న్యాయ సేవలను, న్యాయ సలహాలను పొందవచ్చని తెలియజేశారు. వికలాంగులకు పండ్లు, రొట్టెలు మరియు ఉచిత న్యాయసేవల కరపత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం అధ్యక్షులు మహమ్మద్ ఫయాజ్ అహ్మద్, సీనియర్ న్యాయవాది ఎస్. నాగేశ్వరరావు, న్యాయవాది చాపర దివ్యశ్రీ, పారా లీగల్ వాలంటీర్లు వై. తిరుపతిరావు, దట్టి అనంత్ కుమార్ పాల్గొన్నారు.

## హిందీ భాషలో ప్రావీణ్యత పొందాలి



**పోలాకి, డిసెంబరు 3(వార్త):** హిందీ భాషలో ప్రావీణ్యత పొందాలని పోలాకి మండలం ఈదులవలస ఏపీ మోడల్ పాఠశాల ప్రిన్సిపల్ ప్రవీణ్ అన్నారు. బుధవారం ఆ పాఠశాలలో హిందీ ప్రచార సభ పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. భారతదేశంలో ఉన్న ముఖ్యమైన భాషలలో హిందీ ఒకటని అన్నారు. హిందీ పండిట్ శ్రీరామమూర్తి ఆధ్వర్యంలో ప్రతి ఏడాది హిందీ పరీక్షలు నిర్వహిస్తున్నారని విద్యార్థులు వినియోగించుకోవాలని అన్నారు.

## రైతు సేవా కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



**సారవకోట, డిసెంబరు 3(వార్త):** రైతు సేవా కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సూచించారు. బుధవారం ఆయన బుడితి రైతు సేవా కేంద్రంలో రైతులతో మాట్లాడారు. రైతులకు అవసరమైన అన్ని సేవలను ఈ కేంద్రాలు ద్వారా అందిస్తున్నట్లు తెలిపారు. ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

## సూచనలు పాటిస్తేనే మంచి దిగుబడులు



**సోంపేట, డిసెంబరు 3(వార్త):** వ్యవసాయ శాఖ సూచనలు రైతులు సక్రమంగా పాటించినప్పుడు నాణ్యమైన అధిక దిగుబడులు సాధించడం వీలవుతుందని మండల వ్యవసాయ అధికారి బి నరసింహమూర్తి పేర్కొన్నారు. ఈ మండలం బారువపేట గ్రామంలో బుధవారం రైతన్న మీకోసం కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ సూచనలు సలహాలు అందించారు. ముఖ్యంగా రైతులు అధిక ఆదాయం సాధన పై దృష్టి సారించాలని కోరారు. వ్యవసాయ పెట్టుబడులు తగ్గించుకోవడం, నాణ్యమైన దిగుబడులు సాధించడం పట్ల సరైన ప్రణాళికతో రైతులు వెళ్లాలని తగు సూచనలు సలహాలు అందించారు. పెట్టుబడులు తగ్గించుకునే ప్రక్రియలో వేద జల్లడం, రసాయనక ఎరువులు బదులుగా ప్రకృతి కషాయాలు ఉపయోగించడం చాలా ముఖ్యమని అన్నారు. రవి పంటకు సంబంధించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా రైతులు కొబ్బరి తోటల్లో పురుగులు తెగుళ్ల గూర్చి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గుర్రాల శ్రీను, దున్నసత్యం, కర్రీ సత్యం, ప్రకృతి వ్యవసాయ సమన్వయ అధికారి కుమారి, పశు వైద్య సహాయకులు మల్లేష్, వీఆర్వో భగీరధి తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులకు సేవ అదృష్టం



**కొత్తూరు, డిసెంబరు 3(వార్త):** అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని కొత్తూరులోని భవిత కేంద్రంలో మంగళవారం ఘనంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా లోతుగెడ్డ తులసీ వర ప్రసాద్ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా లోతుగెడ్డ తులసీ వర ప్రసాద్ రావు మాట్లాడుతూ, దివ్యాంగులను కేవలం ప్రత్యేక అవసరాలు గల వ్యక్తులుగా కాకుండా,దైవ స్వరూపాలు గా అభివర్ణించారు. వారికి సేవ చేయడం అనేది ఒక బాధ్యతగా కాకుండా, మనకు లభించిన అదృష్టంగా భావించాలి అని ఆయన ఉద్ఘాటించారు. సమాజంలో వారిని గౌరవించి, వారి ఎదుగుదలకు తోడ్పాటు అందించాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపైనా ఉందని సందేశమిచ్చారు. కార్యక్రమంలో ఇటీవల జిల్లా స్థాయిలో జరిగిన క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన భవిత కేంద్రం విద్యార్థులకు ముఖ్య అతిథి చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. దివ్యాంగుల సామర్థ్యాలను ప్రోత్సహించడం, వారి ఆత్మవిశ్వాసాన్ని పెంచడం ఈ బహుమతుల ప్రధాన ఉద్దేశం.?ఈ వేడుకలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం దివ్యాంగుల హక్కులు, సంక్షేమం పట్ల ప్రజల్లో మరింత అవగాహనను పెంచే ఒక స్ఫూర్తిదాయక వేదికగా నిలిచింది.

## ఇంటింటా రక్త నమూనాలు సేకరణ

**సంతబొమ్మాళి, డిసెంబర్ 3(వార్త):** తాళ్లవలస గ్రామంలో దండు గోపాలపురం ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ విశ్వనాథ్ గంగాధర్ ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది బుధవారం ఇంటింటికి వెళ్లి రక్త నమూనాలను సేకరించారు. ఆ గ్రామంలో డయేరియా సోకి ఒకరు మృతిచెందగా, మరో ఎనిమిది మంది చికిత్స పొందుతున్న సంగతి తెలిసిందే. ఈ మేరకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి, జిల్లాకలెక్టర్ మంగళవారం గ్రామంలో పర్యటించి ప్రతి ఒక్కరి నుంచి రక్తనమూనాలు సేకరించాలని ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ మేరకు రక్త నమూనాలను సేకరించి పరీక్షలు నిర్వహించారు. అలాగే బుధవారం కొత్త డయేరియా కేసులు రాలేదని వైద్యాధికారి తెలిపారు. డిప్యూటీ ఎంపీడీవో దుంపల శ్రీనివాసరావు, స్థానిక పంచాయతీ కార్యదర్శి విజయ్ కుమార్ వర్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



# తాగునీటిని అందించడమే ప్రభుత్వ లక్ష్యం

### -ఎమ్మెల్యే గౌతు శిరీష



**పలాస, డిసెంబరు 3(వార్త):** జీవన్ మిషన్ పథకం ద్వారా తాగునీటి సరఫరా అందించడమే కూటం ప్రభుత్వ లక్ష్యమని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. బుధవారం పలు అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొన్న శాసన సభ్యులు గౌతు శిరీష. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి ఇంటికి త్రాగునీటి సరఫరా జరగాలని తలంపుతో మంచినీటి ట్యాంకులను స్థాపించాలని కంకణం కట్టుకున్నమన్నారు. ఇందులో భాగంగా జలజీవన్ మిషన్ ద్వారా పలాస నియోజకవర్గం వజ్రపుకొత్తూరు మండలం కొత్తపేట గ్రామంలో 60 కిలో లీటర్లు సామర్థ్యం గల నీటి ట్యాంకు ను రూ. 64.30 లక్షలు, దిబ్బవాని పేట గ్రామంలో 20 కిలో లీటర్లు సామర్థ్యం గల నీటి ట్యాంకు ను రూ. 33.60 లక్షలు, కొమరల్తాడ గ్రామంలో 60 కిలో లీటర్లు సామర్థ్యం గల నీటి ట్యాంకును రూ.97.90 లక్షలు వ్యయాలతో శంకుస్థాపన చేయడం జరిగిందాని చెప్పారు. ఎమ్.జి.ఎన్.ఆర్.ఇ.జి.ఎస్.(లి పల్లె పండుగ) నిధులతో వజ్రపుకొత్తూరు మండలం దేవునల్తాడ గ్రామం నుండి కొత్తపేట రైతు సేవ కేంద్రం వరకు రూ. 1,10,00,000 వ్యయంతో తారు (బీటీ) రోడ్డు, పూండి నౌపడ దగ్గరలో గల సుంకర జగన్నాధపురం గ్రామంలో రూ.85,00,000 వ్యయంతో తారు రోడ్డు ప్రారంభించ మన్నారు.ఈ సందర్భంగా జగన్నాధపురం గ్రామంలో సభను ఏర్పాటు చేస్తూ కూటమి ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు గురించి వివరించారు. కార్యక్రమంలో ఏపీ స్టేట్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబురావు, పలాస ఏఎంసీ చైర్మన్ మల్లా శ్రీనివాసరావు, టిడిపి నాయకులు శశిభూషణ్, పుచ్చ దుర్యోధన, మండలంలోని ముఖ్య నాయకులు, కార్య కర్తలు ఆ గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గిరిజన సమస్యలపై 'రచ్చబండ'లో రెడ్డి శాంతి హామీ



**కొత్తూరు, డిసెంబరు 3(వార్త):** అడ్డంగి పంచాయతీ పరిధిలోని మూర్తిమానుగూడలో వైఎస్సార్సీపీ రాష్ట్ర క్రమశిక్షణా కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆధ్వర్యంలో గురువారం 'రచ్చబండ' కార్యక్రమం ఘనంగా జరిగింది.

ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్సీపీ చేపట్టిన 'కోటి సంతకాల ప్రజా ఉద్యమం'లో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ రచ్చబండలో పాల్గొన్న అడ్డంగి పరిసర గిరిజన గూడల ప్రజలు తమ ప్రధాన సమస్యను, రేషన్ సరకుల కోసం కిలోమీటర్ల దూరం నడిచి వెళ్లాల్సిన బాధను మాజీ ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. రేషన్ దూరం సమస్యతో వృద్ధులు, మహిళలు ఎదుర్కొంటున్న కష్టాలను వారు వివరించారు. ప్రజల సమస్యలను శ్రద్ధగా విన్న రెడ్డి శాంతి వెంటనే స్పందిస్తూ, ప్రజల్లో నమ్మకం నింపారు. "జగనన్న ప్రభుత్వం తిరిగి వస్తోంది. గిరిజనుల సమస్యలన్నిటినీ ప్రాధాన్యంగా పరిష్కరిస్తాం" అని హామీ ఇచ్చారు. ముఖ్యంగా, గిరిజన బస్తీలకు మెరుగైన సేవలందించేలా రేషన్ పంపిణీ కేంద్రాల వ్యవస్థను పునర్వ్యవస్థీకరిస్తామని, తిరిగి వైఎస్సార్సీపీ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఈ సమస్యను మొదటి ప్రాధాన్యంగా పరిష్కరిస్తామని తెలిపారు. భారీ సంఖ్యలో గిరిజనులు, మహిళలు, యువత పాల్గొని తమ సంతకాలను నమోదు చేశారు.

ప్రభుత్వ రంగ మెడికల్ విద్యను కాపాడాలని ఈ సందర్భంగా వారు బలమైన సందేశాన్ని ఇచ్చారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్సీపీ కొత్తూరు మండల అధ్యక్షులు గండివలస ఆనందం రావు, చింతాడ సూర్య నారాయణ రావు, ఏ నాగేశ్వర రావు, రంజిత్, సవర రమేష్ ఇతర కార్యకర్తలు పాల్గొన్నారు.

## అధికారుల గైర్హాజరీ..
## తూతూమంత్రంగా మండల సమావేశం



**జలుమూరు, డిసెంబరు 3(వార్త):** జలుమురు మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మండల బాడీ సమావేశం అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు లోపంతో పూర్తిస్థాయిలో జరగకుండానే 'అంతంత మాత్రమే'గా ముగిసింది. సమావేశానికి హాజరైన ఎంపీపీ వానగోపి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ, ముఖ్య అధికారులు హాజరుకాకపోవడం మండల అభివృద్ధి పనులపై ప్రతికూల ప్రభావం చూపుతోందని వ్యాఖ్యానించారు. సర్పంచులు, ఎంపీటీసీలు సమావేశంలో అనేక సమస్యలను లేవనెత్తినప్పటికీ, సమాధానం చెప్పబోయే అధికారులే లేకపోవడంతో వారి అడిగిన ప్రశ్నలు పరిష్కారహీనంగా మిగిలాయి. అధికార పార్టీ సర్పంచ్లు తమ బిల్లులు సమయానికి చెల్లింపవుతున్నాయని చెప్పగా, ప్రతిపక్ష పార్టీ సర్పంచ్ బిల్లులు నిల్వలో ఉన్నాయంటూ మండిపడ్డారు. ఈ వ్యవహారంపై మండలస్థాయిలో అసమానృత ఉందని పలువురు సభ్యులు ఆరోపించారు. రైతుల సమస్యలు కూడా ఈ సమావేశంలో ప్రధాన అంశంగా మారాయి. తలతరియా, చిన్నదాగం, కర్వంజా, జలుమూరు, కొమ్మనాపల్లి, శ్రీముఖలింగం, కరకవలస ప్రాంతాల ఎడమ కాలువ రైతులు రెండో పంటకు నీటి సరఫరా ఉంటుందా లేదా అన్న ప్రశ్నకు ఏఈ మోహిత్ సమాధానమిచ్చే ప్రయత్నం చేసినప్పటికీ, నీటి లభ్యతపై స్పష్టత లేదనే భావన వ్యక్తమైంది. కలెక్టర్ సూచన మేరకు అధికారులు త్వరలో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. ఇంకా, జోనాంకి గ్రామ సర్పంచ్ రమణమ్మ గ్రామ సచివాలయం చివరి బిల్లు విడుదల కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

పంచాయతీరాజ్ శాఖ అధికారులు పనులు పూర్తిగా జరగలేదని అభ్యంతరం చెప్పగా, తాను రెండేళ్ల క్రితమే పనులు పూర్తి చేశానని సర్పంచ్ స్పష్టం చేశారు. సమావేశం మొత్తం అధికారుల హాజరు లేకపోవడం, సమస్యలకు సరైన ప్రత్యుత్తరాలు లేకపోవడం, బిల్లుల వివాదాలు, నీటి సమస్యలపై స్పష్టత రాకపోవడంతో సభ్యులు అసంతృప్తిగా వెళ్లిపోయారు. దీంతో ఈరోజు మండల బాడీ సమావేశం ప్రజలు, ప్రజాప్రతినిధులు కోరుకున్న స్థాయిలో జరగకుండానే ముగిసింది.

## రైతులకు ఆధునిక వ్యవసాయంపై అవగాహన



**కొత్తూరు, డిసెంబరు 3(వార్త):** వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ప్రభుత్వం రూపొందించిన వ్యవసాయ పంచసూత్రాలను ప్రతి రైతు ఇంటికి చేరవేయాలనే లక్ష్యంతో చేపట్టిన "రైతన్నా... మీ కోసం" ప్రత్యేక వర్క్‌షాప్ కార్యక్రమాన్ని కొత్తూరు రైతు సేవా కేంద్రాలలో విజయవంతంగా నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌లకు రైతుల నుండి భారీ స్పందన లభించింది, ఆధునిక వ్యవసాయ పద్ధతులపై రైతుల్లో చైతన్యం తీసుకురావడంలో ఈ కార్యక్రమం కీలకపాత్ర పోషించింది. ఈ సందర్భంగా మండల కూటమి నాయకులు మాట్లాడుతూ ?వ్యవసాయాన్ని లాభసాటి వ్యాపారంగా మార్చేందుకు ప్రభుత్వం రూపొందించిన పంచసూత్రాలను విజయవంతంగా అమలు చేయడం, తద్వారా రైతుల ఆదాయాన్ని పెంచడం ఈ కార్యక్రమం యొక్క ప్రధాన లక్ష్యం. వర్క్‌షాప్‌లో పాల్గొన్న అధికారులు మరియు నాయకులు ప్రతి రైతు ఈ సూత్రాలను పాటించడం ద్వారా మెరుగైన దిగుబడిని, ఆర్థిక స్థిరత్వాన్ని సాధించవచ్చని ఉద్ఘాటించారు.పంచసూత్రాల అమలు విధానం, ప్రభుత్వ పథకాలు, మరియు ఆధునిక సాగు పద్ధతులపై రైతులకు సమగ్ర అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కొత్తూరు మండల టీడీపీ అధ్యక్షుడు అగతముడి మాధవరావు,మండల వైస్ ఎంపీపీ లోతుగడ్డ తులసీ వరప్రసాద్ నాయుడు, కొత్తూరు సర్పంచ్ పడాల కృష్ణవేణి, అగతముడి అరుణ్ కుమార్, టోంపల తిరుపతి రావు, మండల ఆర్గనైజింగ్ సెక్రటరీ ముగితి కృష్ణారావు, చోడవరపు రాము, యూనిట్ ఇన్చార్జులు చోడవరపు లోకేశ్వరరావు, ముగితి లక్ష్మణరావు, చింతాడ కోటేశ్వరరావు, వ్యవసాయ శాఖ ఏడీ, ఏవో,సిబ్బంది, రైతు సోదరులు, కార్యకర్తలు మరియు రైతు సంఘాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

## యూటీఎఫ్ కార్యవర్గం ఏకగ్రీవం

నరసన్నపేట



**నరసన్నపేట, డిసెంబరు 3(వార్త):**నరసన్నపేట యుటిఎఫ్ మండల కార్యవర్గ సంఘం సమావేశం మంగళవారం సాయంత్రం నరసన్నపేట పీఎం శ్రీ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. జిల్లా యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శి బమ్మిడి శ్రీరామ్ మూర్తి ఆధ్వర్యంలో కార్యవర్గ ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఉపాధ్యాయులు ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా నక్క అప్పయ్య, జనరల్ సెక్రెటరీగా ఆర్ జగదీశ్వర్ రావుతో పాటు పలువురు సభ్యులను ఎన్నుకోవడం జరిగిందని శ్రీరామ్ మూర్తి తెలిపారు.

## అంతర్జాతీయ బాడీ బిల్డింగ్ పోటీల్లో
## కంబకాయ కుర్రాడి సత్తా



**నరసన్నపేట, డిసెంబరు 3(వార్త):**నరసన్నపేట మండలం కంబకాయ గ్రామానికి చెందిన పాగోటి సతీష్ అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటారు. థాయిలాండ్లోని సత్తాహిప్ చోనురిలో నవంబర్ 27-28 తేదీల్లో జరిగిన యునైటెడ్ వరల్డ్ స్పోర్ట్స్, ఫిట్నెస్ ఫెడరేషన్ మిస్టర్ అండ్ మిస్ ఆసియా బాడీ బిల్డింగ్ పోటీలలో 75 కేజీల విభాగంలో రెండో స్థానాన్ని గెలుచుకున్నారు. అంతర్జాతీయ స్థాయిలో భారత దేశ ప్రతిభను చాటిన పాగోటి సతీష్ను పలువురు అభినందించారు.

## చిన్నారులను అన్ని విధాలా ఆదుకోవాలి



**నరసన్నపేట, డిసెంబరు 3(వార్త):** దివ్యాంగ చిన్నారులకు అన్ని విధాల ప్రతి ఒక్కరు ఆదుకునే విధంగా కృషి చేయాలని జడ్పీటీసీ మెండ విజయశాంతి తెలిపారు. బుధవారం జలుమూరు మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో ప్రపంచ వికలాంగుల దినోత్సవం కార్యక్రమంలో భాగంగా ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఉపాధ్యాయుడు రామారావు మాట్లాడుతూ.. నేడు దివ్యాంగులకు ప్రభుత్వం సంక్షేమ పథకాల ద్వారా ఆదుకుంటుందని వివరించారు. ఎంఈఓలు, తహశీల్దార్ జె రామారావు తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగ చిన్నారులు ఎవ్వరికీ తీసిపోరు



**నరసన్నపేట, డిసెంబరు 3(వార్త):**దివ్యాంగ చిన్నారులు సాధారణ పిల్లలకు ఏమాత్రం తీసిపోరని వారిని ఆ విధంగా మనం ఆదరించాలని ఎంఈవోలు ఉప్పాడ శాంతారావు, పేడాడ దాలినాయుడు తెలిపారు. ప్రపంచ వికలాంగుల దినోత్సవం సందర్భంగా బుధవారం నరసన్నపేట పీఎం శ్రీ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న భవిత కేంద్రంలో ఘనంగా వికలాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ వారికి తల్లిదండ్రులు ఆసరాగా ఉండాలని అప్పుడే వారిలో చైతన్యం కలుగుతుందని వివరించారు.

## జాడుపల్లి సర్పంచ్ చెక్ పవర్ రద్దు

**మెళియాపుట్టి, డిసెంబరు 3(వార్త):** మెళియాపుట్టి మండలంలో గల జాడుపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ చెక్ పవర్ ను తాత్కాలికంగా రద్దు చేసినట్లు డిపిఓ ఆఫీస్ నుండి ఆదేశాలువచ్చినట్లు ఎంపీడీవో నరసింహ ప్రసాద్ పండా తెలిపారు 2022-23,, 2023- 24 ఆర్థిక సంవత్సరంలో పంచాయతీలో నిధులు దుర్వినియోగానికి సంబంధించి ఆదేశాల అందినట్లు ఎంపీడీవో తెలిపారు.

## మద్యం తాగి వాహనం నడిపితే రూ.10 వేల జరిమానా



**పలాస, డిసెంబరు 3(వార్త):** మద్యం తాగి వాహనం నడిగితే 10,000 జరిమానా విధించినట్లు కాశీబుగ్గ సిఐ పి సూర్యనారాయణ వెల్లడించారు. బుధవారం పలాస కోర్టులో మద్యం త్రాగి వాహనాలు నడిపిన ముగ్గురు వాహన చోదకులకి 10 వేలు రూపాయల చెప్పున 30,000 జరిమానా విధించారని పలస సివిల్ జడ్జి యు మాధురి సిఐ తెలిపారు. బహిరంగ ప్రదేశంలో మద్యం త్రాగి న్యూసెన్స్ క్రియేట్ చేసిన 8 మంది కి ఒక్కొక్కరికి 1000 రూపాయల చెప్పున ఫైన్ వెయ్యటం జరిగిందాని సిఐ వెల్లడించారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546